# 3. క్షతగాత్ర

"నీకొక పూర్ణపురుషుడు లభించేడు" అప్పటికే అయిదారుసార్లు విని ఉండడం వలన విసుగనిపించింది సుజనకి.

"ఎవరతను?" అంది టీజింగ్‌గా.

దెబ్బతిన్నట్టు చూసేడు అభిరాం. అంతలోనే తేలికగా నవ్వేస్తూ "ఈ కప్పు కాఫీ ఖరీదెంతో తెలుసా? నలభై రూపాయలు. దోచుకుతింటున్నారు నా కొడుకులు".

'అంత కాలిక్యులేటెడ్‌గా ఉండాలనుకుంటే ఇలాంటి హొటల్‌కి రావడమెందుకు?' అనబోయి ఆగిపోయింది.

పెళ్ళై పదిరోజులైంది. అతన్తో సిటీ కొచ్చి అయిదురోజులు.

తన కన్నా ఒక చాయ ఎక్కువుండి తెల్లగా అన్పిస్తాడు, నిజమే, మంచి హైటు, సాఫ్ట్‌వేర్ జాబ్.

సుజన తండ్రి చాలా డబ్బుపోసి కొన్నాడు ఇతన్ని.

ఇతనికి ఇదొక బలహీనతా? చాపల్యమా? ఆడవాళ్లంటే చులకనా?

సుజన వెనక ఉన్న టేబుల్ వైపు చూసి చూసి "ఆ ఆడది చూడు, వాళ్లాయన చూడకుండా నాకు కళ్లతో సైగ చేస్తోంది" అన్నాడు.

అప్రయత్నంగా వెనక్కి తిరిగి చూడబోయి ఆగిపోయింది.

పెళ్లిలో జరిగింది గుర్తుకొచ్చింది. తన స్నేహితురాళ్లు లత, స్వప్నలు పెళ్లి తంతు ముగిసే వరకూ తనవెంటే ఉన్నారు.

మొదటి రాత్రి ఇతనన్న మాటకి తను విస్తుపోయింది.

"నీ ఫ్రెండ్సేంటి సిగ్గులేకుండా నా వెంట పడుతున్నారు. కొత్త పెళ్లికొడుకునని కూడా ఆలోచించకుండా శృంగారం వొలకబోస్తున్నారు" అన్నాడు.

తనకొచ్చిన కోపానికి ఘాటుగా సమాధానం చెప్పబోయి ఎలాగో ఆపుకొంది. సున్నితంగా స్పందించాల్సిన తన శరీరం ఫ్రిజిడ్‌గా ఉండిపోయింది. ఆ రాత్రి గురించి తను కన్న కలల్ని అతన్తో పంచుకుంటూ ఎన్నో కబుర్లు కలబోసుకోవాలనుకుంది!

"ఏంటిలా బిగుసుకుపోయావ్, దీని గురించి నీకేమీ తెలీదని నేననుకోవాలనా?"

ఆ బాణం మనస్సులోంచి శరీరం లోపలికి దూసుకుపోయి మొదటిగాయం చేసి మంట రగిలించింది.

మర్నాడు ఆలయంలో క్యూలో తన వెనక నిలబడి అతడు చేసిన వెకిలి చేష్టల్ని ఎలా ఓర్చుకుందో తనకే తెలీదు. అసలు ఆలయాల రద్దీ, మనుషులు కిక్కిరిసిపోయి ఒకర్నొకరు తోసుకోవడాలూ.. అదంతా తనకు ఎలర్జిక్‌గా అన్పిస్తుంది. మనసులో ఉంటే చాలదా, భక్తిని ప్రదర్శించడం అవసరమా అన్పిస్తుంది. వాళ్ల కుటుంబ సభ్యురాలిగా మారేక వాళ్ల నమ్మకాలూ, విధానాలూ పాటించాలంది అమ్మ. ఆలయ మంటపంలో కూర్చుని కొబ్బరి చెక్క చితక్కొట్టి అతనికో ముక్క ఇచ్చి తింటూ "పబ్లిక్‌లో ఏం ప్రవర్తన అది?" అనాలనుకుంది. అంతలో "నా వెనకున్న అంటీ తన అవయవాల్ని నాకు తాకిస్తూ నా వీపుమీద గీరడం మొదలు పెట్టింది" అన్నాడు.

"ఛీ" అంది తను ఏమనాలో తెలీక.

అది తన మీద నిరసనతో అన్నదని గ్రహించక "అవును, కొందరంతే నాలాంటి మగాడు కన్పిస్తే చాలు కోరికతో రగిలిపోతారు" అన్నాడు.

అతన్నెలా అర్థం చేసుకోవాలో తెలీక తలపట్టుకుంది.

ఇప్పుడు తన వెనకున్న ఎవరో స్త్రీ గురించి నీచంగా మాట్లాడుతున్నాడు. కన్పించిన ప్రతి ఆడదీ తనతో పడుకోవాలని తపించిపోతోందంటాడు.

మొదట్లో నిజమని నమ్మి బెంబేలెత్తిపోయింది.

అసలేమిటితని నైజం? పరిశీలనగా చూసింది సుజన.

మనిషి ముక్కు, మొహం బాగానే ఉంటాయి కాని జుట్టు సగం ఊడి పోయి బట్టతల బయటపడుతోంది. ఇరవై ఎనిమిదేళ్లకే నలభై ఏళ్లవాడిలా కన్పిస్తున్నాడు.

ఈ వాగుడు బలహీనత ఏమిటి?

నిన్న అతని కొలీగ్ సుజాత డిన్నర్‌కి పిల్చింది. తిరిగి వచ్చేస్తుంటే ఇద్దరికీ చేయి చాచి షేక్ హేండిచ్చింది.

బైటికొచ్చేక "గమనించేవా అది నాకు షేక్ హేండిస్తూ అరచేతిలో ఎలా గోకిందో" అన్నాడు. అది నిజం కాదని తనకి స్పష్టంగా తెలుసు.

గొంగళిపురుగు శరీరం మీద పాకి అక్కడక్కడ చర్మం లోపలికి నూగునుగుచ్చి వదిలేసిన అనుభూతి. కంటికి కన్పిస్తూ తియ్యడానికి రాని ముళ్లు.

"అవునూ... కాలేజ్‌లో, యూనివర్సిటీలో నీకు బోయ్ ఫ్రెండ్సుండేవారా? హుఁ....

ఎందుకుండర్లే... నీలాంటి అందమైన అమ్మాయికి. నేనొక బకరాగాణ్ణి దొరికేను నీ బాబుకి" ప్రశ్న. జవాబు తనే వ్యంగ్యంలో రంగరించి.

"మా ఆఫీస్ ఇన్‌ఛార్జి ఢిల్లీలో 'అభిరాం! ఈ రాత్రి నాతో స్పెండ్ చెయ్యగలవా' అనడిగింది తెల్సా?"

"ఇవాళ బస్టాండులో ఒకమ్మాయి నా బైక్ ఆపి లిఫ్ట్ అడిగింది. పోనీ కదాని ఎక్కించుకుంటే వెనకనుంచి గ్రీన్ సిగ్నల్స్" పగలబడి నవ్వు...

జీవితంలోకి చేదు ఎలా ప్రవేశిస్తుందో అర్థమైంది సుజనకి. అపురూప మైన తన స్టూడెంట్ లైఫ్‌లోని ఆనందాన్ని సంఘటనలు సంఘటనలుగా అతన్తో పంచుకోవాలనుకున్న తన ఆశ ఎంత అర్థం లేనిదో అర్థమైంది. తను చదివిన సాహిత్యం తనకి జీవితాన్ని ఎలా అర్థం చేసుకోవాలో, ఎలా నడుచుకోవాలో నేర్పిందనుకుంది. కాని, అర్థంకాని మనుషులూ, ప్రవర్తనలూ ఉంటాయని ఇప్పుడిప్పుడే అర్థమౌతోంది.

లిఫ్ట్‌లో పైకెళ్లి టెర్రెస్ మీద నిలబడింది సుజన. ఏడంతస్తుల భవనం పైనుంచి చూస్తూంటే కింద రోడ్డుమీద మనుషులూ, వాహనాలూ నడుస్తున్న చిన్నచిన్న బొమ్మల్లాగ. పౌర్ణమి వెన్నెలే అయినా కింద దేదీప్యమానంగా వెలుగుతున్న లైట్ల వెలుగు దాన్ని చిన్నబోయేట్లు చేస్తోంది. రెండూ కలిసిన జాజర వెలుతురు ఆకాశానికీ, భూమికీ మధ్య సన్నని యవనికలా....

ఊళ్లో తమ ఇంటి చిన్నిడాబా మీద పున్నమినాటి చందమామ కురిపించే పాలవెన్నెల గుర్తుకొచ్చింది.

కొబ్బరాకుల సందుల్లోంచి చొచ్చుకుని వచ్చే చారల చారల వెన్నెల.... పక్కనే ప్రవహించే ఏటినీళ్ల గలగలలు. దూరంగా చేలల్లో ఎవరో వచ్చీరానట్టు వాయించే శృతి లేని మురళీగానం... చీకటి రాత్రుల్లో నల్లని చుక్కల చీర ధరించే విశాలాకాశం... చాపమీద వెల్లకిలా పడుకొని, అరచేతులు తలకింద పెట్టుకుని అర్ధరాత్రి వరకూ ఊహల ఉయ్యాలలూగిన టీనేజ్ రోజులు... ఎర్రగా పండిన గోరింటాకు చేతుల పరిమళంలా మనసుకు హత్తుకుపోయాయి.

ఈ ఒంటరితనంలో గతాన్ని తల్చుకోవడం ఎంత బాగుంది!

"మీరు కొత్తగా వచ్చేరు కదా!" వాటర్ టేంక్ పక్కనుంచి వినవచ్చిన సన్నని గొంతు విని వెనక్కి తిరిగింది సుజన.

"నా పేరు నీలిమ" మసక వెలుతుర్లో తెల్లని పాలరాతి బొమ్మలా...

సుజన తన పేరు చెప్పింది.

"కొత్తగా వచ్చిన వాళ్లకి ఈ ఫ్లాట్స్ జీవితం చాలా బోరెత్తిస్తుంది. మీకేం తోచనప్పుడు మా ఫ్లాట్‌కి వస్తూ ఉండండి... క్రియేటివ్ సబ్జెక్ట్స్ మీద చర్చించుకుందాం. అహ... మీకు ఆసక్తి ఉంటేనే... ఈ టైంలో మీరు టెర్రస్ మీదికి వచ్చేరంటే టీవీ సీరియల్స్‌కి ఎడిక్ట్ కాలేదని అన్పిస్తోంది'.

సుజన మౌనంగా నవ్వింది.

కొంతసేపు కబుర్లు....

"వర్షం వచ్చేలా ఉంది. పదండి కిందికి వెళ్దాం" అంటూ నీలిమ లిఫ్ట్ వైపు అడుగులు వేస్తూండగా పవర్ పోయింది. ఇద్దరికీ ఫక్కున నవ్వొచ్చింది.

మెట్లమీంచి దిగుతూ "మీ ఇంటికి పిలవరా?" అంది నీలిమ.

దానికీ సన్నగా నవ్వి ఊరుకుంది సుజన.

ఇంత అవగాహనతో మాట్లాడుతున్న ఈమె గురించి అభిరాం చేసే పిచ్చి కామెంట్స్ వినడం తనకిష్టం లేదు.

ఫోర్త్ ఫ్లోర్‌లో ఆగిపోయిన తనకి 'బై' చెప్పి కిందికి వెళ్లిపోయింది నీలిమ. ఆమెని పిలవకపోవడంలో తనకేదో ఇబ్బంది ఉందని ఆమెకి అర్థమైనట్టే అన్పించింది.

కేండిల్ వెలిగించి ఒంటరిగా సోఫోలో కూర్చుంది సుజన.

అభిరాం ప్రవర్తన గురించి ఎవరికీ, చివరికి అమ్మకి కూడా చెప్పుకోలేదు. అలాగని భరించలేదు.

అతని మాటల జుగుప్స భరించలేక రాత్రి కాకుండా ఉంటే బాగుండునన్పిస్తోంది. ఇది ప్రూవ్ చెయ్యలేని హింస. కొత్తగా తన శరీరం గురించి కామెంట్స్ మొదలు పెట్టేడు. అక్కడ అలా లేదు, ఇక్కడ ఇలా లేదు అంటాడు. తనని గిల్టీ ఫీలయ్యేలా చెయ్యాలనుకుంటాడు. 'ఫలానా సినిమా తార ఎంత బావుంటుందో, నువ్వూ ఉన్నావ్ ఎందుకు?' అంటాడు.

ఉదయం న్యూస్ ఛానల్ చూపించిన సంఘటన మీద అతనికీ తనకీ మధ్య జరిగిన డిస్కషన్ గుర్తుకొచ్చింది –

ప్రేమ పేరుతో కాలేజ్ అమ్మాయిని నరికి చంపిన స్కౌండ్రల్ గురించి మాట్లాడుతూ "దానికెందరితో సంబంధాలున్నాయో, అంతవరకూ వస్తే పౌరుషం ఉన్న మగవాడెవడైనా చంపిపారెయ్యక ఏం చేస్తాడు?" అన్నాడతను హఠాత్తుగా.

"అలా మాట్లాడ్డానికి సిగ్గుగా లేదూ, ఏ యుగంలో ఉన్నాం మనం?" అని ఛీత్కరించింది తను.

'అతని ఆలోచనా విధానంలోనే ఏదో లోపం ఉంది' అనుకుంది సుజన.

రోజులు గడుస్తున్నాయి అతి భారంగా.

ఉదయం ఇంట్లోంచి వెళ్లినవాడు రాత్రి పొద్దుపోయి ఎప్పుడో వస్తాడు.

వీకెండ్స్‌లో కూడా ఇంట్లో కంప్యూటర్ ముందే ఎప్పుడూ. లేదా ఏదైనా గంతులేసే హీరో సినిమానో చూస్తూ గడుపుతాడు.

సుజనకి బోర్‌డమ్ భరించలేనిదిగా ఉంది. ఆ మాటే నీలిమతో అంటే "బోర్‌గా ఉండదూ మరి రోజంతా ఇంట్లో అలా ఖాళీగా గడిపితే. మా కాలేజ్‌లో కనుక్కోమంటావా, రీ ఓపెన్ రోజులు కదా, లెక్చరర్ పోస్టేదయినా ఖాళీ ఉందేమో".

"మా వారు ఏమంటారో?" సంశయంగా ఎటో చూస్తూ అంది సుజన.

నీలిమ నవ్వింది. "ముందు నీలో ధైర్యం, ఆసక్తి ఉన్నట్టు లేవు".

మర్నాడు అతనికి కాఫీ ఇస్తూ "నేను ఏదైనా జాబ్‌కి అప్లయ్ చెయ్యనా?" అంది సుజన.

"ఏం పిచ్చిదానివా ఏంటి? శుభ్రంగా తిని ఇంట్లో కూర్చోలేక" అని కొట్టి పారేసాడతను.

మరోసారి తనకి చదవాలన్పించిన నాలుగైదు పుస్తకాల లిస్టొకటి రాసిచ్చింది.

అతను దాన్నొకసారి చదివి, అలవోకగా చించి పడేసాడు తన ముందే.

"నీకు బుర్రలో మట్టితప్ప ఏమీ ఉన్నట్టు లేదు. అంత పెద్ద టీ.వి. ఎవరికోసం కొన్నాను? హాయిగా కావాల్సిన సీరియల్స్ చూసుకోక పుస్తకాలు చదువుతానంటావు. కళ్లకు ఎంత స్ట్రెయిన్ తెలుసా?" అన్నాడు.

ఇదేం ప్రేమ?

"ఫర్వాలేదు, నాకా స్ట్రెయినే కావాలి" అని అరవాలన్పించింది సుజనకి. తనలో ఈ బలహీనత ఏమిటి? ఎందుకు అతని ముందు తన అభిప్రాయాల్ని నిర్భయంగా వెల్లడించి సాధించుకోలేకపోతోంది?

కారణం ఆమెకి హఠాత్తుగా స్ఫురించింది -

తన తల్లికీ, తండ్రికీ అభిప్రాయాలు ఎప్పుడూ కలిసేవి కావు. ఆవిడ ఎడ్డెం అంటే ఆయన తెడ్డెం అనేవాడు. ఫలితంగా ఇంట్లో గొడవలు.

ఆ భయం తనలో మొక్క మొలిచి.... వేళ్లూనుకొని.... తననింత పిరికి దాన్ని చేసిందా? అవును, తను కోరుకున్న స్వతంత్రం పుట్టింట్లో మాత్రం ఎక్కడ లభించింది? ఆడపిల్లకు అనువైన సబ్జెక్ట్ అంటూ తండ్రి సెలక్టు చేసిన సబ్జెక్టుతోనే చదవాల్సి వచ్చింది.

చదువు కాగానే ఉద్యోగంలో చేరతానంటే "అమ్మా, ఆడపిల్ల సంపాదన తినే ఖర్మ పట్టించకు. నీ వెనక ఇంకా ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ముందు నీ భారం వదిలితేగాని వాళ్ల బరువు వదిలించుకోలేను. పెళ్లయ్యాక నీ ఇష్టం. అతనొప్పుకుంటే ఏమైనా చేసుకోండి" అన్నాడు తండ్రి.

నీలిమ తీరికగా ఉన్నప్పుడు ఆమెతో మాట్లాడే ఆ కొద్ది సమయం తప్ప జీవితం ఘనీభవించిన ఓ మంచుకొండలా అయిపోయింది. తన మాటల్ని వినే తీరికగాని, తన అభిప్రాయాల్ని గౌరవించాలనే సహృదయంగాని అతనికి లేవు.

ఆ రోజు ఉదయం సుజన నిద్ర లేచేసరికి గది మొత్తం తిరుగుతున్నట్టనిపించింది. లేస్తే వొళ్లు తూలింది. భరించలేని వికారం. తిరిగి మంచం మీద చతికిలబడింది.

తనకేదో అయిపోతోంది. ఆలోచించి ఆలోచించి బుర్రకేమో అయిపోయింది. బహుశా చచ్చిపోబోతోందా?...

వీకెండ్ -

అతనింకా ముసుగు తియ్యలేదు.

లేపాలని మీద చెయ్యి వేసింది. నిద్రలో అట్నుంచి ఇటు తిరిగేడు.

ఏమీ ఎరగని అమాయకుడిలా ఎంత ప్రశాంతంగా ఉంది అతని మొహం! ఆ మాస్క్ తొలగిస్తే రోజూ ఇతర స్త్రీల గురించి అతను మాట్లాడే అసహ్యకరమైన మాటలు... రాత్రి తనకేమైందో... తట్టుకోలేక "ఇక చాలు, ఆపు" అని అరిచింది.

ఛెళ్లుమని చెంప పగలగొట్టేడతను. తర్వాత ఎప్పటిలాగే తనను బలవంతంగా ఆక్రమించుకున్నాడు... తిరిగి తను అతని చెంప ఛెళ్లు మనిపించలేకపోయిందెందుకని?

కడుపులో ఉండ చుట్టుకుని ఏదో తిరుగుతోంది. వాష్ బేసిన్ దగ్గరికి పరుగెత్తి భళ్లున వాంతి చేసుకుంది. పచ్చని పసరు ముద్దలు ముద్దలుగా... ఏమైంది తనకి?

ఏమైందో కాసేపటికి స్ఫురించింది. కాళ్లు సన్నగా వణకడం తెలుస్తోంది. గుండె దడదడలాడుతోంది. నిస్సత్తువతో గోడకి చేరబడి అలాగే కిందికి జారికూర్చుంది.

భయం వద్దు భయం వద్దు - తెచ్చుకో, ధైర్యం తెచ్చుకో... జీవితం జీవించడానికే.

తను తల్లి కాబోతోంది. మరి కొద్ది నెలల్లో తన వొంటరితనమంతా చెరిగిపోతుంది.

చాలా చిత్రంగా ఉంది సుజనకి. ఇష్టంగా పాల్గోని కలయికలోంచి ఓ బుల్లిపాపాయి సృజన... అవును తన పాపాయి పేరు సృజన.

ఏదో తెలీని చాపల్యంతో చాంచల్యంతో, ఆనందంతో అతన్ని తట్టి లేపింది.

విసుగ్గా కళ్లు తెరిచిన అతను "సరేలే, మీ అమ్మలాగ ఆడపిల్లల్ని కనేవు గనక' అని అటు తిరిగి పడుకున్నాడు. ఉక్రోషంతో కంపరమెత్తిపోయింది సుజనకి.

టేబుల్ దగ్గరికి నడిచి పెన్నూ పేపరూ తీసుకుంది –

అభిరాం గారూ!

మీలో నాకు నచ్చని లక్షణమేంటో మీకు తెలుసు. అది స్త్రీలంటే చులకన భావమో లేక మీ మానసిక వైకల్యమో నాకు అర్థం కావడం లేదు. మౌనం నేరం అనుకుని మాట్లాడబోతే మీ అహం నాకా అవకాశం ఇవ్వడం లేదు. పరిష్కరించుకోగలిగే సమస్యలకు విడాకులు పరిష్కారం కాదని నా నమ్మకం. అందుకే నేను కొన్ని రోజులు మా ఊరికి వెళ్తున్నాను. అహాన్ని పక్కన పెట్టి మిమ్మల్ని మీరొకసారి అనలైజ్ చేసుకొని చూడండి. మనం పెరిగిన పరిసరాలు వేరు కావడం వలన, మన మధ్య ఇంతరవకు సరైన ఇంటిమసీ ఏర్పడకపోవడం వలన ఇంతకన్నా చనువు తీసుకోలేక పోతున్నాను. మిమ్మల్ని మీరు సరిదిద్దుకోగలిగితే తప్పకుండా కలుసుకుందాం. లేకుంటే నా చదువు నాకొక ఉద్యోగాన్ని సంపాదించిపెట్టకపోదు.

– సుజన

లెటర్ మడతపెట్టి మంచం పక్క టీపాయ్ మీద పెట్టింది. తన బట్టలు సర్టిఫికేట్లు సూట్‌కేస్‌లో సర్దుకుని బైటికి నడిచింది సుజన.

*(29-3-2009 ఆదివారం ఆంధ్రజ్యోతి)*